క్లుప్తంగా

మద్యం పట్టివేత

ఉండవెల్లి: మండల కేంద్రంలో మద్యం తరలిస్తున్న వాహనాలు పట్టుకొని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్ తెలిపారు. శనివారం పోలీసుల వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని మద్యం దుకాణంలో కొనుగోలు చేసుకుని బైక్‌పై దాసరి గణేష్, పుసులపాటి ఆంజనేయులు ఇద్దరు కలిసి లింగన్‌వాయి గ్రామానికి 12.24 లీటర్ల మద్యాన్ని తరలిస్తుండడంతో పోలీసులు పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీని విలువ రూ. 13,464 ఉంటుందని అంచనా వేశారు. కర్నూల్‌కు చెందిన ఆటో డ్రైవర్ గంగపుత్ర గుణ శేఖర్ మండల కేంద్రంలోని బాలాజీ వైన్స్ నుంచి 13.5 లీటర్ల మద్యాన్ని తరలిస్తుండగా పట్టుకుని సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. వాటి విలువ రూ.14,850 ఉంటుందని అంచనా వేశారు. కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.

శాంతినగర్: మద్యం తరలిస్తున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదుచేసిన ఘటన వడ్డేపల్లి మున్సిపాలిటీ పరిధిలోని పైపాడు స్టేజీ వద్ద శనివారం చోటుచేసుకుంది. పైపాడ్ స్టేజీ వద్ద పోలీసులు తనిఖీ నిర్వహిస్తుండగా బొంకూర్‌కు చెందిన తెలుగు శ్రీనివాసులు బైక్‌పై మద్యం తరలిస్తూ పట్టుబడ్డాడు. అతన్ని అదుపులోకి తీసుకుని 43 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నరేష్ పేర్కొన్నారు.

నిరుపయోగంగా కమ్యూనిటీ భవనం



మల్దకల్: మండలంలోని బిజ్వారం గ్రామంలో బీసీ కమ్యూనిటీ భవనం నిరుపయోగంగా ఉంది. 18ఏళ్ల క్రితం రూ.6లక్షల వ్యయంతో నిర్మించిన ఈ కమ్యూనిటీ భవనం ఎస్సీ కాలనీకి సమీపంలో ఉండటంతో బీసీ కాలనీ వాసులు ఈ కమ్యూనిటీ భవనాన్ని వినియోగించకపోవడంతో నిరుపయోగంగా ఉంది. దీంతో ఈ భవనం యాచకులకు, మద్యం ప్రియులకు ఆవాసంగా మారింది. లక్షలు వెచ్చించి నిర్మించినా కమ్యూనిటీ భవనం నేడు శిథిలావస్థకు చేరింది. అధికారులు స్పందించి కమ్యూనిటీ భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఇంటింటి ప్రచారంలో..

అయిజ: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే ప్రజల కష్టాలను తొలగిస్తామని ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ అన్నారు. పట్టణంలోని వివిధ కాలనీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండల కేంద్రంలో శనివారం మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ సతీమణి మహాలక్ష్మి కాంగ్రెస్ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

గట్టు: కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి సరిత ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. శనివారం బోయలగూడెం, లింగాపురం, చిన్నోనిపల్లి, అంతంపల్లి, చాగదోన,మిట్టదొడ్డి, ముచ్చోనిపల్లె, తుమ్మలపల్లి గ్రామాల్లో కాంగ్రెస్ అభ్యర్థి సరిత ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

ధరూరు: చిత్తశుద్ధి కలిగిన నాయకుడికి పట్టం కట్టాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ గద్వాల ఎమ్మెల్యే అభ్యర్థి గొంగ్లళ్ల రంజిత్ కుమార్ సతీమణి గొంగ్లళ్ల సాహితి అన్నారు. మన్నాపురంలో ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు.

అయిజ: బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న కుమార్ శనివారం పట్టణంలోని వివిధ కాలనీల్లో బీఎస్పీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

శాంతినగర్: గ్రామాలు, పట్టణాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం చొరవ చూపుతోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. వడ్డేపల్లి పుర పరిధిలోని శాంతినగర్ రాజగోపాల్ గృహంలో బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు.

పాములు పట్టే వ్యక్తి ఎమ్మెల్యేగా నామినేషన్



ఉండవెల్లి: అలంపూర్ ఎమ్మెల్యే అభ్యర్థి బరిలో ఉండవెల్లి మండలానికి చెందిన నలుగురు వ్యక్తులున్నారు. పుల్లూరు గ్రామానికి చెందిన విజేయుడు బీఆర్ఎస్ నుంచి నామినేషన్ వేశారు. కలుగోట్లకు చెందిన శేషు (భారత చైతన్య యువజన పార్టీ) నామినేషన్ దాఖలు చేశారు. బొంకూరుకు చెందిన హెచ్ మద్దిలేటి, కంచుపాడుకు చెందిన పాముల ఆంజనేయులు నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ దాఖలు వేసిన లిస్టులో కంచుపాడు గ్రామానికి చెందిన పాములను పట్టుకునే ఒక సాధారణ వ్యక్తి, 2009లో నామినేషన్ దాఖలు వేశారు. మరల 2023లో ప్రస్తుతం నామినేషన్ దాఖలు చేశా రు. పార్టీలలో లేకుండా పాములు పట్టే వ్యక్తి ఎమ్మెల్యే అభ్యర్థిగా ఉండడంతో అతని చూసి ధైర్యపడాలా, జాలి పడాలా అని ఆలోచిస్తున్నారు.

క్రీడలతోనే మానసికోల్లాసం

వీపనగండ్ల: క్రీడలు మానసిక ఉల్లాసాన్ని ఇస్తాయని ప్రజాప్రతినిధులు అన్నారు. శనివారం మండల కేంద్రంలో దీపావళి, గంగమ్మ జాతరను పురస్కరించుకొని వీపీఎల్ 3 క్రికెట్ పోటీలను ప్రారంభించారు. గ్రామాల్లోని యువకులు క్రీడల్లో పాల్గొని క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు.

వేంకటేశ్వరా పాహిమాం

- పాగుంటలో నేటి నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం
- అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ కమిటీ
- మొదలైన జాతర సందడి



ముస్తాబైన వేంకటేశ్వరస్వామి ఆలయం (ఇన్‌సెట్లో : బంగారుతో అలంకరించిన స్వామివారు)

కేటీదొడ్డి: కోరిన కోర్కెలు తీర్చుస్తూ భక్తుల కొంగు బంగారంగా వెలుగొందుతున్న వెంకటాపురం లక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు ఆలయం ముస్తాబైంది. కొండపై ఆహ్లాదకర వాతావరణంలో వెలసిన స్వామివారి బ్రహ్మోత్సవాలు ప్రతియేటా అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. కాలూర్‌తిమ్మన్‌దొడ్డి మండలంలోకి పాగుంట వెంకటాపురం చేరింది. దీంతో నూతన మండలంలో అతి పెద్ద జాతర ఇక్కడి నుంచే ప్రారంభమవుతుంది. ఆదివారం స్వామివారి కల్యాణోత్సవంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయని ఆలయ ఈఓ పురేందర్ తెలిపారు. ఇప్పటికే ఏర్పాట్లు చురుకుగా సాగిస్తున్నారు. వివిధ ప్రాంతాల నుంచి మిఠాయి, రంగుల రాట్నాలు, జాయింట్ వీల్స్ ఏర్పాటవుతున్నాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా రోడ్లు, విద్యుత్ సౌకర్యం తాగునీటి వసతి సదుపాయాలు కల్పించేందుకు ఆలయ కమిటీ సిబ్బంది చర్యలు చేపడుతున్నారు.

బ్రహ్మోత్సవాలు ఇలా..

ఆదివారం బ్రహ్మోత్సవాలు ప్రారంభం ధ్వజారోహణం 13న సోమవారం ఉదయం 11గంటలకు



ముస్తాబైన స్వామివారి రథాలు

స్వామి వారి కల్యాణోత్సవంతో బ్రహ్మోత్సవం అంకురార్పణ జరుగుతుంది. అదేరోజు సాయంత్రం 6 గంటలకు ప్రభోత్సవం, 14న మంగళవారం సాయంత్రం 6గంటలకు రథోత్సవం, 15న బుధవారం సాయంత్రం 5 గంటలకు స్వామి వారి పల్లకీ సేవ కార్యక్రమాలు, 16న గురువారం 5 గంటలకు ప్రాతరాధన, అర్చన సేవాకాలము, సాయంత్రం శ్రీవిష్ణు సహస్రస్తోత్ర పారాయణం, బలహారం తీర్థ ప్రసావ గోష్ఠి కార్యక్రమాలుంటాయి.

జాతరకు ప్రత్యేక బస్సులు..

వేంకటేశ్వరస్వామి జాతరకు గద్వాల ఆర్టీసీ అధికారులు ప్రత్యేకంగా బస్సులను నడుపుతారు. గద్వాల నుంచి రాయచూర్ మార్గంలోని కొండాపురం స్టేజీ వద్ద కొండాపురం గ్రామం మీదుగా వెంకటాపురం చేరుకోవచ్చు. దాదాపు 30 కిల్లోమీటర్ల దూరంలో ఉన్న స్వామివారి ఆలయం ఉంటుంది. భక్తులు వేలాదిగా తరలివచ్చి స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.



జాతరకు కోసం జాయింట్ వీల్స్ ఏర్పాటు చేసిన దృశ్యం



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

కాంగ్రెస్ కుట్రలను అడ్డుకోవాలి

గద్వాల రూరల్/ధరూర్/గట్టు: గద్వాలలో కాంగ్రెస్ పార్టీ వలస నేతల కుట్రలను అడ్డుకుని గద్వాలను కాపాడుకోవాలని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన తన నివాసంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరేందుకు వచ్చిన సందర్భంగా వారినుద్దేశించి మాట్లాడారు. కొత్తగా ఏర్పడిన తెలంగాణను అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తూ అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతే ధ్యేయంగా సీఎం కేసీఆర్ పనిచేస్తున్నారని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ అసమర్థ నాయకుల వల్ల వలసలు, విద్యుత్ కోతలు, రైతుల ఆత్మహత్యలు నిత్యకృత్యంగా ఉండేవన్నారు. ఆనాడు తెలంగాణను నిండాముంచిన పార్టీ కాంగ్రెస్ అని ఇప్పుడు పదేళ్ల సీఎం కేసీఆర్ పరిపాలనలో అన్నిరంగాల్లో దూసుకెళ్తుందన్నారు. అనంతరం ఆయన గద్వాల నియోజకవర్గంలోని పట్టణంలోని వివిధ వార్డులకు చెందిన వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, అదేవిధంగా ధరూరు, కేటీదొడ్డి, గద్వాల, మల్దకల్ మండలాలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి ఎమ్మెల్యే పార్టీలోకి ఆహ్వానించారు.

ప్రతి రంగానికి 24 గంటల కరెంటు..

రాష్ట్రంలో ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు అందించిన ఘనత తెలంగాణ ప్రభుత్వానిదేనని, రాష్ట్రంలోని ప్రతి రంగానికి 24 గంటల కరెంటు అందించిన చరిత్ర కేసీఆర్ ప్రభుత్వానికే దక్కిందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. చిన్నపాడు, పారుచర్ల, సోంపురం, మన్నాపురం, దోర్నాల, గ్రోనిపల్లి, ఓబులోనిపల్లి, ర్యాలంపాడు, మార్లబీడు, చెన్నారెడ్డిపల్లి, బూరెడ్డిపల్లి, ధరూరు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాగర్‌దొడ్డి వెంకట్రాములు, వైస్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, డీఆర్ విజయ్ కుమార్, నాయకులు పటేల్ ప్రభాకర్ రెడ్డి, ఈశ్వరయ్య, రఘువర్ధన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, సుధాకర్‌రెడ్డి, డీఆర్ శ్రీధర్, సురేందర్‌రెడ్డి, కుర్వ శ్రీను, పురుషోత్తం రెడ్డి, అబ్రహం, రాములు, నర్సింహులు పాల్గొన్నారు.

రైతు బాంధవుడు కేసీఆర్

రైతు బాంధవుడు కేసీఆర్ అని, కారు గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా బండ్ల కృష్ణమోహన్‌రెడ్డిని మరోమారు గెలిపించాలని స్టేట్ కన్జ్యూమర్ ఫెడరేషన్ కార్పొరేషన్ చైర్మన్ గట్టు తిమ్మప్ప తెలిపారు. శనివారం గట్టులో ఎమ్మెల్యే కుమారుడు సాయిసాకేత్‌రెడ్డితో కలిసి గట్టు తిమ్మప్ప ఎన్నిక ప్రచారంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ జంబురామన్‌గౌడు, ఎంపీపీ విజయ్‌కుమార్, పీఏసీఎస్ చైర్మన్ వెంకటేష్, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, నాయకులు మోహన్‌గౌడు, రామునాయుడు, బస్వరాజు, భాస్కర్, కృష్ణ, సంతోష్, బజారి, తిమ్మప్ప పాల్గొన్నారు.

ఆదిశిలా క్షేత్రంలో ప్రత్యేక పూజలు



ఆదిశిలా క్షేత్రంలో పూజలు చేస్తున్న భక్తులు

మల్దకల్: మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న ప్రధాన దేవాలయాల్లో భక్తులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మల్దకల్ స్వయంభు లక్ష్మీ వేంకటేశ్వరస్వామి, సద్దలోనిపల్లి కృష్ణస్వామి, కుర్తిరావులచెర్వు గట్టు తిమ్మప్ప, శేషంపల్లి శివసీతా రామస్వామి, చర్లగార్లపాడు వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొంత మంది భక్తులు స్వామి వారికి దాసంగా నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆదిశిలా క్షేత్రం, కృష్ణస్వామి ఆలయాల్లో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ సత్యాచంద్రారెడ్డి, నిర్వాహకులు అరవింద రావు, చంద్రశేఖర్‌రావు, నాయకులు మధుసూదన్‌రెడ్డి, సీతారామిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, బాబురావు, ఆలయ సిబ్బంది ఊరుకుంది, శ్రీను, రంగస్వామి, శివమ్మ, కృష్ణ ఉన్నారు.

విశ్వరూప మహాసభకు తరలిన నాయకులు



మార్లబీడు నుంచి హైదరాబాద్‌కు తరలి వెళ్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ధరూరు: ఎస్సీ వర్గీకరణ కోసం మంద కృష్ణ మాదిగ నేతృత్వంలో హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన విశ్వరూప మహాసభకు ఎమ్మార్పీఎస్ నాయకులు పెద్దఎత్తున తరలివెళ్లారు. శనివారం మండలంలోని మార్లబీడు, ధరూరు, చింతరేవుల, చిన్నపాడు, మన్నాపురం తదితర గ్రామా ల నుంచి ప్రత్యేక వాహనాల్లో భారీగా తరలివెళ్లారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మార్లబీడు దేవదాను, నాగరాజు, బొబ్బాయి ఏసన్న, ఆటో క్రిష్ణ, సాలోమోన్, మల్దకల్ పాల్గొన్నారు.

మానవపాడు: మండల కేంద్రం నుంచి శనివారం విశ్వరూప మహాసభకు మండలం నుంచి నాయకులు జయరాజ్, శ్రీను ఆధ్వర్యంలో పెద్దసంఖ్యలో తరలివెళ్లారు. కార్యక్రమంలో బీచుపల్లి, మల్దకల్లు, పురుషోత్తం, నరేష్, సురేంద్ర ఉన్నారు.

వాహనాల తనిఖీ



కేటీదొడ్డి: ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో పోలీసులు వాహనాలు ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. శనివారం మండలంలోని రాష్ట్ర సరిహద్దు నందిన్నె చెక్‌పోస్టు వద్ద ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులు పోలీసుల ఆధ్వర్యంలోని తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా కర్ణాటక రాష్ట్రాల నుంచి తెలంగాణలోకి మద్యం, డబ్బులు రాకుండా అధికారులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పోలీస్ హెడ్ కానిస్టేబుల్ చక్రవర్తి, పోలీసు సిబ్బంది ఉన్నారు.

బాధ్యులపై వారిపై చర్యలు తీసుకోవాలి

గట్టు: ప్రభుత్వ పాఠశాలలోని బాత్‌రూం తలుపును విరగొట్టిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని బోయలగూడెం గ్రామ యువకులు శనివారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బోయలగూడెంలోని ప్రభుత్వ పాఠశాలలో ఓ కంపెనీ ఇటీవల నూతనంగా బాత్‌రూంను నిర్మించి అప్పగించింది. ప్రారంభించిన రెండు రోజులకే బాత్‌రూం తలుపులను గుర్తు తెలియని వ్యక్తులు విరగొట్టారు. ఈ వ్యవహారంపై విచారణ చేసి, చర్యలు తీసుకోవాలని గ్రామ యువకులు పోలీసులకు విజ్ఞప్తి చేశారు.

వాల్మీకులను ఎస్టీలుగా గుర్తించాలి

గట్టు: వాల్మీకులను ఎస్టీలుగా గుర్తించేలా బీజేపీ రాష్ట్ర నాయకులు చొరవ తీసుకోవాలని మండల కేంద్రానికి చెందిన ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగి భరత్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. వాల్మీకులను ఎస్టీలుగా గుర్తించే అంశం కేవలం ఎన్నికల నినాదంగానే మారిందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ తీసుకుని ఆచరణలో పెట్టాలని విజ్ఞప్తి చేశారు. వాల్మీకులు ఎస్టీలుగా గుర్తించే పోరాటం 60 ఏళ్లుగా కొనసాగుతూనే ఉందన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చొరవ తీసుకుని వాల్మీకులను ఎస్టీలుగా గుర్తించాలని విజ్ఞప్తి చేశారు.

ఇంట్లో చోరీ

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం పట్టణంలోని ఓ ఇంటిలో చోరీ జరిగిందని ఎస్ఐ వెంకటస్వామి తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీరంగాపురం పట్టణానికి చెందిన గొల్లచింతల నాగేంద్రమ్మ ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి ఈ నెల 10న తాటిపాములకు వెళ్లింది. 11వ తేదీన ఉదయం ఇంటి తలుపులు తెరుచుకొని ఉండడంతో స్థానికులు చూసి ఫోనులో ఆమెకు సమాచారం అందించారు. వెంటనే ఇంటికి వచ్చి చూడగా గుర్తుతెలియని వ్యక్తులు ఇంటికి వేసిన తాళం పగలగొట్టి దొంగతనానికి పాల్పడ్డారని గుర్తించి, ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా బీరువాను విరగొట్టారు. ఇంట్లో విలువైన వస్తువులు ఏవీ పోలేదన్నారు. ఇంటి యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్ఐ తెలిపారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

పెబ్బేరు రూరల్: వనపర్తి పట్టణం బిజ్నాగడ్డతండాకు చెందిన బాలమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆదేశానుసారం వనపర్తి నియోజకవర్గ ఎన్నికల సన్వయకర్త వంగూర్ ప్రమోద్‌కుమార్‌రెడ్డి స్థానిక నాయకులతో కలిసి శనివారం మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. మృతుడి కుంటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. వారివెంట బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మూడు రిజర్వాయర్లు పూర్తిచేస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి

శాంతినగర్/మానవపాడు/అయిజ: వచ్చే ఐదేళ్లలో మూడు రిజర్వాయర్లు పూర్తి చేసే బాధ్యతను తాను తీసుకుంటానని ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి రైతులకు భరోసా ఇచ్చారు. శాంతినగర్‌లో మాజీ జెడ్పీటీసీ వడ్డేపల్లి శ్రీనివాసులు వర్గం వడ్డేపల్లి, రాజోళి మండలాలకు చెందిన మద్దతు దారులు ఎమ్మెల్సీ చల్లా సమక్షంలో అలంపూర్ బీఆర్ఎస్ అభ్యర్థి విజేయుడుకు పూర్తి మద్దతు తెలిపారు. చిన్నోనిపల్లి, మూడు రిజర్వాయర్ల ద్వారా ఆర్డీఎస్ ఆయకట్టును సమస్యశ్యామలం చేస్తామ న్నారు. రైతులకు సాగునీటి ఇబ్బందులు క లుగ కుండా మాటిస్తే అలంపూర్‌లో అభ్యర్థిని గెలిపించుకుని వస్తామని కోరగా తప్పకుండా ఆర్డీఎస్ రైతులను ఆదుకుంటానని సీఎం తనకు హామీ ఇచ్చారన్నారు.

నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తాం

సీఎం కేసీఆర్ సహకారంతో అలంపూర్ నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి అన్నారు. పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బీఆర్ఎస్ నాయకుడు సంకాపురం రాముడు ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు. సీఎం కేసీఆర్‌తో మాట్లాడి అయిజను రెవెన్యూ డివిజన్‌గా చేస్తామని, డిగ్రీ కళాశాల మంజూరు చేస్తామని, చిన్నోనిపల్లి రిజర్వాయర్ నుంచి లింక్ కెనాల్ ఏర్పాటు చేసి ఆర్డీఎస్ కాల్వకు సాగునీరు విడుదల చేస్తామన్నారు. సమావేశంలో జోగుళాంబ బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్ చిన్న కృష్ణయ్య, బీఆర్ఎస్ నాయకులు చల్లారెడ్డి, పుల్లూరు నాగేశ్వర్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, కిషోర్, భార్గవ్‌యాదవ్, చంద్రగౌడ్, విష్ణువర్ధన్‌రెడ్డి, మాణిక్యరెడ్డి, ఆంజనేయులుగౌడ్, రోశన్న, రాజోళి గోపాల్, అజయ్, గోపాల్‌రెడ్డి, ధోత్రె నారాయణ పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి విజేయుడు

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం

దేశంలో ఎక్కడాలేని అభివృద్ధి తెలంగాణ రాష్ట్రంలో జరిగిందని, బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని బీఆర్ఎస్ అభ్యర్థి విజేయుడు అన్నారు. శనివారం అయిజ మండలంలోని ఉత్తనూరులో ధన్వంతరి వేంకటేశ్వరుడి ఆలయంలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి ప్రత్యేక పూజలు చేసి, ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం మండలంలోని సింధనూరు, కుటుకనూరు, కొత్తపల్లి, తొత్తినోనిదొడ్డి, మూగోనిపల్లి, భూంపురం, ఈడుగోనిపల్లి, సంకాపురంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.



గొర్రెలకు టీకాలు వేస్తున్న సిబ్బంది

గొర్రెలకు పీపీఆర్ టీకాలు

అయిజ: గొర్రెలకు, మేకలకు పారుడు రోగం రాకుండా ఉండేందుకు మండలంలోని వివిధ గ్రామాల్లో వెటర్నరీ సిబ్బంది టీకాలు వేసే కార్యక్రమం నిర్వహించారు. శనివారం మండలంలోని తూంకుంట, బింగుదొడ్డి గ్రామాల్లో వెటర్నరీ సిబ్బంది గొర్రెలకు, మేకలకు టీకాలు వేశారు. మొత్తం 1927 గొర్రెలకు, 40మేకలకు టీకాలు వేసినట్లు వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ స్వరూపారాణి తెలిపారు.



అమరచింత శివారులో కల్లాల వద్దే వడ్లు కొనుగోలు చేస్తున్న ప్రైవేట్ వ్యాపారులు

మద్దతు ధర సరే.. కొనుగోలు కేంద్రాలు ఏవి?

- కల్లాల వద్దే దళారుల వ్యాపారం
- పభుత్వ కొనుగోలు కేంద్రాలు లేక ఇబ్బందులు
- ప్రైవేట్ వ్యాపారులు చెప్పిందే రేటు..

అమరచింత: వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి రైతుల నుంచి నేరుగా వరి ధాన్యం కొనుగోలు చేస్తామన్న ప్రభుత్వ అధికారుల ప్రకటనలు కేవలం పత్రికలకే పరిమితమయ్యాయి. మండలంలో ఇప్పటికీ వరి కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేయకపోవడంతో దళారులు రైతుల పంట పొలాలకు వద్దకే వెళ్లి కల్లాల నుంచే వరిధాన్యం కొనుగోలు చేస్తున్న పరిస్థితులు దాపరించాయి. ప్రభుత్వం వరికి రూ.2,250 మద్దతు ధర ఇస్తున్నామని ప్రకటించారే తప్పా ఇప్పటి వరకు ఒక్క కొనుగోలు కేంద్రం సైతం ఏర్పాటు చేయలేదని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో దళారులను ఆశ్రయిస్తున్నామని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అకాల వర్షాలతో..

ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ప్రధాన ఎడమ కాల్వ ఆయకట్టు పరిధితో పాటు అమరచింత ఎత్తిపోతల పథకం ఆయకట్టులో వరికోతలు ప్రారంభమయ్యాయి. దీంతో కల్లాల్లో వరిధాన్యం ఆరబెట్టుకోవడానికి వాతావరణం అనుకూలించక పోవడం, అకాల వర్షాల కారణంగా తక్కువ ధర వస్తున్న తమ వరిధాన్యం అమ్ముకోవాలనే తాపత్రయంతో తక్కువ ధరకే దళారులకు ధాన్యం విక్రయించి రైతులు నష్టపోతున్నారు. ప్రైవేట్ వ్యాపారులు సన్నరకం వరికి రూ.2,100, దొడ్డు రకానికి రూ.1,850 చెల్లిస్తున్నారు. ఇప్పటికే జిల్లాలోని ఆయా మండలాల్లో వరికోతలు జోరందుకున్నాయన్న విషయాలను తెలుసుకున్న ప్రైవేట్ వ్యాపారులు వరి కొనుగోళ్లపై దృష్టి సారించి, సేకరించిన ధాన్యాన్ని కర్ణాటక రాష్ట్రానికి తరలించే పనుల్లో నిమగ్నమయ్యారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి దళారీ వ్యవస్థను రూపుమాపి ప్రభుత్వ పరంగా వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

బొడ్రాయి పండుగను విజయవంతం చేద్దాం

అమరచింత: పట్టణంలో ఈనెల 14 నుంచి 16 వరకు నిర్వహించే బొడ్రాయి పండుగను జయప్రదం చేయడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కమిటీ చైర్మన్, మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ కోరారు. పట్టణంలోని మార్కండేయ ఆలయ ఆవరణంలో శనివారం బొడ్రాయి ఉత్సవ కమిటీ సభ్యులతో కలిసి ఉత్సవాల నిర్వహణ గురించి సమీక్ష నిర్వహించారు. ఈమేరకు మాట్లాడుతూ 13న సాయంత్రం బొడ్రాయిని పట్టణ పురవీధుల గుండా భక్తిశ్రద్ధలతో ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. 14న గణపతి పూజ జలాదివాసంతో కార్యక్రమాలు ప్రారంభవుతాయన్నారు. 15న యాగశాలలో హోమపూజ, మధ్యాహ్నం బొడ్రాళ్లను ఇంటి ఆడపడుచులు అందరితో ఊరేగింపు కార్యక్రమం ఉంటుందని తెలిపారు. 16న ఉదయం 9:15 నుంచి 10 గంటల మధ్య ఏకకాలంలో బొడ్రాళ్ల ప్రతిష్ఠాపన జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో తాటికొండ రమేష్, వెంకట్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, నాగభూషణంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.